సాక్షి తిరుపతి
బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



డ్రైవింగ్ శిక్షణ సంస్థకు అనుమతి

జిల్లాలో డ్రైవింగ్ శిక్షణ సంస్థ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని జిల్లా రవాణాశాఖాధికారి వెల్లడించారు. - 8లో



ఆధునికంగా తిరుపతి రైల్వేస్టేషన్

తిరుపతి రైల్వేస్టేషన్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నట్లు స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ వెల్లడించారు. - 8లో



ముక్కంటీ.. కనవేంటి!

ముక్కంటి ఆలయంలో ప్రసాదాల కొరతపై భక్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

తల్లిపాలే తొలి వ్యాక్సిన్

- రోటరీ మిల్క్ బ్యాంక్ ప్రాజెక్ట్ చైర్మన్ దామోదరం



మాట్లాడుతున్న దామోదరం

తిరుపతి సిటీ : తల్లిపాలే బిడ్డకు తొలి వ్యాక్సిన్ అని రోటరీ మిల్క్ బ్యాంక్ ప్రాజెక్ట్ చైర్మన్ టెంకాయల దామోదరం తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుపతి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గ్లోబల్ గ్రాంట్ ప్రాజెక్ట్ సహకారంతో గత ఏడాది ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో హ్యూమన్ మిల్క్ బ్యాంకు ఏర్పాటు చేశామన్నారు. ఏడాదిలో 1,086మంది ఆరోగ్యవంతమైన తల్లుల నుంచి సుమారు 247లీటర్ల పాలను సేకరించామని వెల్లడించారు. ఆ పాలను 3,475మంది పిల్లలకు అందించి ప్రాణాలు నిలబెట్టామని వివరించారు. తల్లి పాలు సేకరించి నెలలు నిండక ముందే జన్మించినవారు, తక్కువ బరువుతో పుట్టినవారు, తల్లికి దూరమైన బిడ్డలకు ఉచితంగా అందించడం గర్వంగా ఉందన్నారు. ఈ ఏడాదిలో ప్రధానంగా ముగురు మాతృమూర్తులు ఒక్కొక్కరు 20, 22, 34 లీటర్లు పాలను తల్లిపాలనిధికి అందించడం విశేషమని, అందులో ఓ డాక్టర్ సైతం ఉండటం అభినందనీయమని తెలిపారు. ఈ క్రమంలోనే గురువారం ప్రసూతి ఆస్పత్రిలోని మిల్క్ బ్యాంక్‌లో తొలి వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సోము రవికుమార్, సెక్రటరీ రాజేష్‌కుమార్, కో చైర్మన్ హేమచంద్ర, రుయా విశ్రాంత సూపరింటెండెంట్ భారతి, విశ్రాంత ప్రొఫెసర్ రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దేశ వ్యాప్తంగా ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 2, 3, 4, 7 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, 8వ తేదీ మధ్యాహ్నం సెషన్‌లో బీఈ, బీటెక్ అభ్యర్థులకు నిర్వహించనున్నారు. అలాగే 9వ తేదీ బీఆర్క్, బీప్లానింగ్ విద్యార్థులకు పరీక్షను నిర్వహించనున్నారు.

రుయాలో అరుదైన శస్త్ర చికిత్స



బాలిక, తల్లిదండ్రులతో వైద్య బృందం

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో ఐదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. వివరాలు.. అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లె మండలం ఆరోగ్యపురం గ్రామానికి చెందిన గణేష్ నాయక్ కుమార్తె అక్షర (5) అనే బాలికకు, పుట్టుకతో యోని నుంచి మూత్రం నిరంతరం కారుతోంది. దీంతో బాలిక తల్లిదండ్రులు రుయాలోని చిన్న పిల్లల వైద్యనిపుణుడు బి.జగదీష్‌ను ఆశ్రయించారు. బాలికను పరీక్షించిన వైద్యుడు ఈ మేరకు శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. వెంటనే వైద్య బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. ఆపరేషన్‌లో అనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ రాధ, డాక్టర్ ఎస్ఎస్ రావు, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ మనోహర్ పాల్గొన్నారు. వైద్యబృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రావు అభినందించారు.



ఆనందం పదింతలు!

తిరుపతి జిల్లా వ్యాప్తంగా 164 పరీక్ష కేంద్రాల్లో మార్చి 17 నుంచి ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా సోషల్ పేపరుకు మొత్తం 27,094 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా అందులో 393 మంది గైర్హాజరైనట్టు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆయా కేంద్రాల వద్ద సందడి చేశారు. ఒకరికొకరు అభినందనలు తెలుపుకుంటూ ఆనందంతో ఉప్పొంగిపోయారు. వసతి గృహాల్లోని విద్యార్థులు సొంత గ్రామాలకు బయలుదేరి వెళ్లారు.

– తిరుపతి ఎడ్యుకేషన్

కలర్‌ఫుల్ కర్బూజా!



సాధారణంగా కర్బూజా ఆకుపచ్చ రంగులో ఉంటుంది. లోపల మాత్రం రెడ్ కలర్‌తో నోరూరించేలా కనిపిస్తుంది. అయితే మంగళవారం తిరుపతి నగరంలో పసుపు రంగులోని పుచ్చకాయ దర్శనమిచ్చింది. ప్రత్యేకంగా ఉండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు పెద్దసంఖ్యలో జనం ఆసక్తిచూపించారు. వ్యాపారి బండి వద్దే తింటూ రుచిని ప్రశంసించారు. మరికొన్నింటిని కొనుక్కుని ఇళ్లకు తీసుకెళ్లారు.– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

మందు బాబులు మద్యం తాగుతుంటే.. కూటమి నేతలు వారి రక్తం పీల్చేస్తున్నారు. వైన్‌షాపు యజమానులను గుప్పిట్లో పెట్టుకుని యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. ప్రధానంగా షాడో ఎమ్మెల్యేలుగా మారిన కొందరు ఘనులు మొత్తం వ్యవహారం నడిపిస్తున్నారు. కమీషన్ల కోసం డిమాండ్ లేని బ్రాండ్లను వైన్‌షాపు నిర్వాహకులకు అంటగడుతున్నారు. ఈ క్రమంలోనే తాము చెప్పిన వారికే పర్మిట్ రూమ్ ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నారు. అందులో రెట్టింపు ధరలకు తినుబండారాలు విక్రయిస్తూ మద్యపాన ప్రియుల జేబులను ఖాళీ చేసేస్తున్నారు. అలాగే కాసుల కక్కుర్తితో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయిస్తున్నారు. నాసిరకం బ్రాండ్లను అధిక రేట్లకు అమ్ముకుంటూ రూ.కోట్లు పోగేసుకుంటున్నారు. మామూళ్ల మత్తులో అధికారులను జోకొట్టి ఇష్టారాజ్యంగా అక్రమార్జనకు తెగబడుతున్నారు.



షాడోలకే కిక్!

కూటమి నేతల గుప్పిట్లో వైన్‌షాపు యజమానులు

- డిమాండ్ లేని బ్రాండ్లను అంటగట్టి.. అమ్మాలని ఒత్తిడి
- పర్మిట్ రూములే ఆదాయ వనరుగా దందా
- మందుబాబులకు చుక్కలు చూపిస్తున్న పచ్చమూక
- బెల్టు దుకాణాలతో నిలువు దోపిడీ

తిరుపతి జిల్లా సమాచారం

మొత్తం మద్యం దుకాణాలు	247
పర్మిట్ రూమ్‌లు	680
బెల్టు షాపులు	సుమారు 2 వేలు

చిత్తూరు జిల్లా సమాచారం

మొత్తం మద్యం దుకాణాలు	111
పర్మిట్ రూమ్‌లు	350
బెల్టు షాపులు	900లకు పైనే

సాక్షి ప్రతినిధి, తిరుపతి : మద్యం దుకాణాలను కూటమి నేతలు తమ అక్రమార్జనకు అడ్డాగా మార్చేసుకున్నారు. రూ.లక్షలు వెచ్చించి వైన్‌షాపు దక్కించుకున్న వారి కంటే పచ్చమూక ఆదాయమే అధికంగా ఉన్నట్లు పలువురు వ్యాపారులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయామని వైన్‌షాపుల యజమానులు లబోదిబో మంటుంటే.. సందట్లో సడేమియా అంటూ కూటమి ఎమ్మెల్యేల పేరు చెప్పి కొందరు షాడోలు జేబులు నింపుకుంటున్నారు. ఇందుకోసం ప్రధానంగా పర్మిట్ రూమ్‌లనే తమ అక్రమ సంపాదనకు కేంద్రాలుగా తయారు చేసుకున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో మద్యం దుకాణాల కంటే.. అనధికారిక పర్మిట్ రూములు, బెల్టు దుకాణాలనే అధికంగా ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. అధిక మొత్తంలో వెచ్చించి దక్కించుకున్న దుకాణాల నుంచి కూటమి నేతలు ఎవరికి వారు రకరకాల రూపంలో మామూళ్లు వసూలు చేసుకుంటున్నారు.

అట్టపెట్టెలను కూడా వదలరా..?

ప్రతి దుకాణానికి మద్యం సీసాలను అట్టపెట్టెల్లో సరఫరా చేస్తుంటారు. ఆ అట్టపెట్టెలను మద్యం వ్యాపారులు రూ.11, రూ.12 చొప్పున విక్రయిస్తుంటారు. అయితే చిత్తూరులో మాత్రం షాడో ఎమ్మెల్యే ఆ అట్టపెట్టెలను సైతం తనకే అమ్మాలని, అదీ కేవలం రూ.8 చొప్పునే చెల్లిస్తామని స్పష్టం చేసినట్లు తెలిసింది.

చిత్తూరులో ఆయనదే పెత్తనం

చిత్తూరు నియోజక వర్గ పరిధిలో మొత్తం 18 మద్యం దుకాణాలు ఉన్నాయి. నిబంధనల మేరకు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడి రాదని భావించి వ్యాపారులు పర్మిట్ రూములు, బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే వాటన్నింటిపై చిత్తూరు షాడో ఎమ్మెల్యే దృష్టి సారించారు. మద్యం వ్యాపారులందరూ తాను చెప్పినట్లే నడుచుకోవాలను హుకుం జారీ చేశారు. అన్ని దుకాణాలు తన కనుసన్నల్లోనే నడవాలని ఆదేశించారు. అందులో భాగంగా పర్మిట్ రూములు, బెల్టు షాపులు తాను చెప్పిన వారికే ఇవ్వాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సైతం వ్యాపారులకు ఫోన్లు వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం.

మేం చెప్పిందే అమ్మాలి!

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని నియోజక వర్గాల్లోని మద్యం దుకాణాలపై కూటమి నేతల పెత్తనం తారస్థాయికి చేరినట్లు తెలిసింది. డిమాండ్ ఉన్న మద్యాన్నే ఎక్కువ మంది మద్యం ప్రియులు కొనుగోలు చేస్తుంటారు. చిత్తూరు నగరం లాంటి చోట పెద్దగా అమ్ముడుపోని మద్యాన్ని ఎక్కువగా విక్రయించాలని షాడో ఎమ్మెల్యే ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మద్యం డీలర్ల నుంచి కొందరు కూటమి నేతలు మామూళ్లు పుచ్చుకుని మద్యం ప్రియులపై నాసిరకం బ్రాండ్లను రుద్దుతున్నారని ప్రచారం జరుగుతోంది. చిత్తూరులో లభించే అనామక బ్రాండ్లే ఇందుకు నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బెల్టు దుకాణాల్లో అయితే డిమాండ్ లేని మద్యం మాత్రమే అందుబాటులో ఉండేలా సదరు షాడో ఎమ్మెల్యే పక్కాగా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

ప్రతి నెలా..ఆదాయం ఇలా

జిల్లా పేరు	మద్యం విక్రయాలు	పర్మిట్ రూముల్లో విక్రయాలు	ఆదాయం
తిరుపతి	రూ.340 కోట్లు	రూ.20 కోట్లు	రూ.52 కోట్లు
చిత్తూరు	రూ.116 కోట్లు	రూ.10కోట్లు	రూ.18 కోట్లు

చెరువుల సుందరీకరణే లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : జిల్లాలోని చెరువుల రక్షణతో పాటు సుందరీకరణే లక్ష్యంగా పనులు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో కలసి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సప్లయ్ చానళ్లను పునరుద్ధరించాలని సూచించారు. పట్టణ, నగర ప్రజలు సరదా కొంత సమయం గడపేందుకు వీలుగా చెరువు గట్లను తీర్చిదిద్దాలని కోరారు.రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తిరుపతి,శ్రీకాళహస్తి ఆర్‌డీఓలు రామమోహన్, భాను ప్రకాష్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు వెంకటేశ్వరప్రసాద్,శారద, మత్స్యశాఖ జిల్లా అధికారి నాగరాజు, సర్వే విభాగం జిల్లా అధికారి అరుణ్‌కుమార్, తిరుపతి కార్పొరేషన్ ఎస్ఈ శ్యామ్‌సుందర్, తుడా ఎస్ఈ కృష్ణారెడ్డి, తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, రూరల్ తహసీల్దార్ రామాంజనేయులు పాల్గొన్నారు.

రంగంపేట హైస్కూల్ అభివృద్ధికి చర్యలు

సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు చంద్రగిరి మండలంలోని రంగంపేట హైస్కూల్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్‌డీఓ రామమోహన్, డీపీఓ సుశీలాదేవి, డీఈఓ కేవీఎన్ కుమార్, శ్రీసిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే విద్యాసంవత్సరానికి రంగంపేట హైస్కూల్‌ను స్టేట్ ఆఫ్ ఆర్ట్ మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సుధాకర్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథ, చంద్రగిరి తహసీల్దార్ శివరామ్ పాల్గొన్నారు.

అధికారుల అత్యుత్సాహం

భాకరాపేట: ఎర్రావారిపాళెం మండలం, నెరబైలు పంచాయతీలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించారు. అదే టీడీపీ, కూటమి నేతలు ఏర్పాటు చేసిన బ్యానర్లను అలాగే ఉంచేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, వెంకటసిద్దులు అధికారులను ప్రశ్నించారు. వారిపై పంచాయతీ అధికారులు, పోలీసులు దురుసుగా ప్రవర్తించినట్టు సమాచారం.



వైఎస్సార్‌సీపీ బ్యానర్లు తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

నేటి నుంచి డీడీఈ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో దూరవిద్య పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో 43 పరీక్షా కేంద్రాలను, వివిధ రాష్ట్రాలలో 8కిపైగా స్టడీ సెంటర్ల పరిధిలో యూజీ, పీజీ పరీక్షలు నిర్వహించనున్నారు. సుమారు 32 వేల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

హనుమపై కోదండరాముని విహారం



హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీకోదండరామస్వామి



వాహన సేవలో కళాకారుల ప్రదర్శన

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం ఉదయం సర్వాంగ సుందర రూపుడై శ్రీకోదండరామస్వామి తన ప్రియ భక్తుడైన హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. అడుగడుగునా భక్తులు హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం శ్రీసీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి గజవాహన సేవ వేడుకగా సాగింది. పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

దాచేసి..దోచేసి!



- రేషన్ బియ్యంలో గోల్‌మాల్
- 783.15 మెట్రిక్ టన్నులు తినేసిన డీలర్లు
- తనిఖీలు చేపట్టనున్న అధికారులు



జిల్లా సమాచారం

చౌక దుకాణాలు	1,457
రేషన్ కార్డులు	5.91లక్షలు
మార్చిలో సరఫరా చేసిన బియ్యం	8395.12 మెట్రిక్ టన్నులు
ఈనెల పంపింది	7,611.15 మెట్రిక్ టన్నులు

తిరుపతి అర్బన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రేషన్ డీలర్ల మాయాజాలం మొదలైంది. గత వైఎస్సార్‌సీపీ సర్కారులో స్వాహా చేసేందుకు అవకాశం లేకపోవడంతో ఆకలి మీదున్న చౌక దుకాణదారులకు ఇప్పుడు యథేచ్ఛగా భోంచేసే సమయం వచ్చింది. దీంతో ఇష్టారాజ్యంగా రేషన్ బియ్యం బొక్కేయడం ప్రారంభించారు. పౌరసరఫరాశాఖ రాష్ట్రస్థాయి అధికారులు లెక్కలు పంపే వరకు జిల్లా అధికారులకు అసలు సంగతి బోధపడలేదు. గత ఆరునెలలుగా డీలర్లు దాదాపు 783.15 మెట్రిక్ టన్నుల స్టాక్‌ను నిల్వ చేసినట్లు జిల్లా అధికారులు గుర్తించలేదు. అయితే రాష్ట్రస్థాయి అధికారుల నుంచి ఏ డీలర్ వద్ద ఎంత బియ్యం స్టాక్ ఉందో జాబితా పంపడంతో ఇప్పుడు మేల్కొన్నారు. దీంతో తనిఖీలు చేపట్టి బియ్యం లెక్కలు తేల్చడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే చౌకదుకాణాలకు 8,395.12 మెట్రిక్ టన్నులను మార్చిలో పంపితే, ఈ నెలలో మాత్రం డీలర్ల వద్ద నిల్వలను మినహాయించి 7,611.15 మెట్రిక్ టన్నులను మాత్రమే సరఫరా చేశారు.

ఆరునెలలుగా వ్యాపారం

గత ఆరునెలలుగా రేషన్ డీలర్లు యథేచ్ఛగా పేదల బియ్యాన్ని అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి నెలా కొద్ది కొద్దిగా బియ్యం దాచేసి, బయటి మార్కెట్‌లకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ నెల పౌరసరఫరాలశాఖ అధికారులు తగ్గించి బియ్యం సరఫరా చేయడంతో డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఇన్నాళ్లుగా స్టాక్‌లో చూపకుండా అమ్ముకున్న బియ్యం ఎలా సర్దుబాటు చేయాలో అర్థంకాక కార్డుదారులను బుజ్జగిస్తున్నట్లు సమాచారం. ఈ నెలలో బియ్యం ఇవ్వలేమని, మొత్తం కోటాను వచ్చే నెలలో ఇస్తామని బతిమాలుకుంటున్నట్లు తెలిసింది. కొందరు డీలర్లు మరో అడుగు ముందుకేసి కేజీ బియ్యానికి రూ.10 చొప్పున ఇస్తాం సర్దుకోండని నచ్చజెబుతున్నట్లు చర్చసాగుతోంది. ఇదే క్రమంలో కందిపప్పు పంపిణీలో సైతం డీలర్లు భారీగా అవకతవకలకు పాల్పడినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

బియ్యం ఇవ్వాల్సిందే..



మార్చితో పోల్చుకుంటే ఈ నెలలో 783.15 మెట్రిక్ టన్నుల బియ్యం తక్కువగా డీలర్లకు సరఫరా చేశాం. . అయితే ఆ బియ్యం తమ వద్ద స్టాక్ ఉన్నట్లు డీలర్లు చెబుతున్నారు. మరోసారి డీలర్ల వద్దకు వెళ్లి నిల్వలను తనిఖీ చేస్తాం. ప్రతి కార్డుదారుడికీ తప్పనిసరిగా బియ్యం ఇవ్వాల్సిందే. ఎవరైనా బియ్యం ఇవ్వలేదని ఫిర్యాదు చేస్తే తప్పకుండా సదరు డీలర్‌పై చర్యలు తీసుకుంటాం. మరోవైపు కందిపప్పు స్టాక్ ఉందని కొందరు డీలర్లు డీడీలు కట్టలేదు. దీంతో కందిపప్పును తక్కువగానే పంపించాం.

– శేషాచలం రాజు, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి

బెదిరించారు.. తొలగించారు

తిరుపతి సిటీ : ఎస్వీయూ కో–ఆపరేటివ్ స్టోర్స్‌లో నాలుగేళ్లుగా పనిచేస్తున్న తమను అధికారులు బెదిరించారని, విధుల నుంచి అక్రమంగా తొలగించారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు కో–ఆపరేటివ్ స్టోర్స్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా 17 మంది ఉద్యోగులను రోడ్డున పడేశారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా సహకారశాఖ అధికారులు వ్యవహరించిన తీరు దారుణంగా ఉందని ఆరోపించారు. చివరకు మహిళా ఉద్యోగులను సైతం ఫోన్‌లో బెదిరించారని, ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని వెల్లడించారు. వర్సిటీ అధికారుల ఒత్తిడి మేరకే సహకారశాఖ జిల్లా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా తమను తొలగించారని అనుమానం వ్యక్తం చేశారు. సర్వీసులో ఉన్న తమను రోడ్డున పడేసి, విశ్రాంత సిబ్బంది, బయటి వ్యక్తులతో పనిచేయించుకుంటున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తొలగింపునకు గురైన ఉద్యోగులు సుబ్రమణ్యం, గురవారెడ్డి, మునయ్య, సైదా, సాగర్, సత్యవేలు, వెంకటేష్, లక్ష్మీదేవి, స్రవంతి, తులసి ప్రియ, జగదీష్, నాగరాజు, రాజమోహన్, తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

క్లుప్తంగా

నేడు విశ్వంలో ఉచిత నమూనా ప్రవేశ పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో బుధవారం ఉదయం 9గంటలకు పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ నమూనా ప్రవేశ పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న ఆయా ప్రవేశ పరీక్షలకు అనుగుణంగా నమూనా పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 73,007 మంది స్వామివారిని దర్శించుకోగా 27,440 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.04 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పింఛన్ల పంపిణీలో ఫస్ట్!



నారాయణవనంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: జిల్లాలో తొలి రోజు 96.22 శాతం పింఛన్లు పంపిణీ చేసి.. రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన నారాయణవనంలోని కైనికట్టువీధిలో పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అవమానంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు శ్రీదేవి

వెంకటగిరి రూరల్ : ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో తనను అవమానించారని పారవోలు ఎంపీటీసీ సభ్యులు పుల్లూరు శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. సమావేశానికి ఆహ్వానించి కుర్చీలో కూర్చోనివ్వలేదని, ప్రశ్నించినందుకు తన భర్త సదారెడ్డితో పాటు పాశెంకోట సర్పంచ్ వేణురెడ్డి, మాజీ సర్పంచ్ తిరుమలను బయటకు నెట్టేశారని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

ఉజ్వల భవితకు పాలిటెక్నిక్

- 15వ తేదీ వరకు పాలిసెట్ దరఖాస్తుకు గడువు
- పదో తరగతి విద్యార్థులకూ అవకాశం
- ఇంటర్ ఒకేషనల్ విద్యార్హతతో ద్వితీయ ఏడాదిలో నేరుగా ప్రవేశం
- బ్రిడ్జి పరీక్ష ద్వారా ఐటీఐ విద్యార్థులకూ సెకండియర్‌లో అడ్మిషన్
- 30న ప్రవేశ పరీక్ష.. నేటి నుంచి ఉచిత శిక్షణ



తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ ఉత్తీర్ణులైన వారికి ఉపాధి అవకాశం అధికంగా ఉంటుంది. బీటెక్ పూర్తి చేసివారి కంటే ఉద్యోగాల ఎంపికలో ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ సెక్టార్‌లోనూ పాలిటెక్నిక్ వారికే పెద్దపీట వేస్తున్నారు. తక్కువ సమయం, ఖర్చుతో ఉద్యోగ, ఉపాధిని సులువుగా పొందే వెసులుబాటు పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల ద్వారా ఉంటుందని నిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలోనే పాలిసెట్ రాసేందుకు పదోతరగతి విద్యార్థులు సైతం పోటీ పడవచ్చని తెలియజేస్తున్నారు.. ఇంటర్ ఒకేషనల్ విద్యార్హతతో నేరుగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చని చెబుతున్నారు. అలాగే ఐటీఐ విద్యార్థులు బ్రిడ్జి పరీక్ష ద్వారా డిప్లొమా కోర్సుల్లో ద్వితీయ ఏడాదికి అడ్మిషన్ అందుకోవచ్చని వివరిస్తున్నారు. ఇంతటి సువర్ణావకాశాలు గల ఈ కోర్సులపై జిల్లాలోని పాలిటెక్నిక్ సిబ్బంది సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. పిల్లల ఉజ్వల భవితకు దిశా నిర్దేశం చేస్తున్నారు. పాలిటెక్నిక్ కోర్సులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై సాక్షి ప్రత్యేక కథనం..

30న ప్రవేశ పరీక్ష

పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీన తిరుపతి, సత్యవేడు, గూడూరులోని పరీక్ష కేంద్రాల్లో పాలిసెట్ నిర్వహించనున్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400ఫీజు చెల్లించి ''డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీపీఓఎల్‌వైసీఈటీ.ఏపీ.ఎస్‌బీసీ.ఇన్'' అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థులు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ లో ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ సెంటర్ సహకారంతో సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.

కళాశాలల వివరాలు

జిల్లాలో మొత్తం 14 పాలిటెక్నిక్ కళాశాలు ఉన్నాయి. అందులో ప్రభుత్వ కాలేజీలు 6, ఎయిడెడ్-1, ప్రైవేటు-7 ఉన్నాయి.

ప్రభుత్వ పాలిటెక్నిక్ : ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(తిరుపతి), ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (చంద్రగిరి), ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(పిల్లారిపట్టు-పుత్తూరు), ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (సత్యవేడు), ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(గూడూరు), ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫర్ సిరామిక్ టెక్నాలజీ కళాశాల (గూడూరు).

ఎయిడెడ్: ఎస్వీడబ్ల్యూ పాలిటెక్నిక్ కళాశాల(తిరుపతి)

ప్రైవేట్ : శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల (రంగంపేట), కేఎంఎం పాలిటెక్నిక్ కళాశాల (నరసింగాపురం), చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల (రేణిగుంట రోడ్డు-తిరుపతి), సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల (పుత్తూరు), వెంకటపెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాల (పుత్తూరు), గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాల (సూళ్లూరుపేట), ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల (గూడూరు).

ప్రవేశం ఇలా..

ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్హతతో ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా పాలిటెక్నిక్‌లో చేరొచ్చు. అలాగే ఇంటర్ ఒకేషనల్ చేసిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరై ద్వితీయ ఏడాది పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులో ప్రవేశం పొందవచ్చు. అలాగే ఐటీఐ ట్రేడ్‌లలో 60శాతానికి పైగా మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు బ్రిడ్జి కోర్సు ద్వారా నిర్వహించే అర్హత పరీక్షకు హాజరవ్వాలి. ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ద్వితీయ ఏడాది పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులో అడ్మిషన్ పొందవచ్చు. ఈ క్రమంలోనే ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు, ఇదివరకే పదో తరగతి పూర్తి చేసిన వారు పాలి సెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ప్రవేశం నాటికి పదో తరగతి సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది.

బ్రాంచ్‌లు, సీట్ల వివరాలు

ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ, సీఎంఈ, బీఎం, సీహెచ్‌ఎస్‌టీ, సీసీపీ, డిప్లొమా ఇన్ కెమికల్ ఇంజినీరింగ్ షుగర్ టెక్నాలజీ స్పెషలైజేషన్, డిప్లొమా ఇన్ మైనింగ్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ అండ్ కమర్షియల్ ప్రాక్టీస్, డిప్లొమా ఇన్ సెరామిక్ టెక్నాలజీ బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులు. అయితే డిప్లొమా ఇన్ బయోమెడికల్ ఇంజినీరింగ్ మాత్రం మూడున్నరేళ్ల కోర్సు.

నేటి నుంచి ఉచిత శిక్షణ

జిల్లాలోని 6 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం బుధవారం నుంచి 27వ తేదీ వరకు ఉచిత శిక్షణతో పాటు మెటీరియల్‌ను అందించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12,30 గంటల వరకు శిక్షణ ఉంటుంది.

కోర్సులు..ఉద్యోగావకాశాలు

- సివిల్ ఇంజినీరింగ్ 3 ఏళ్ల డిప్లొమా కోర్సు. పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, రోడ్లు భవనాలు, రైల్వే, సర్వే, డ్రాయింగ్, నీటి సరఫరా. అలాగే ఆయా శాఖల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయి. అలాగే వీరు బీటెక్ సివిల్ ఇంజినీరింగ్, సివిల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీరింగ్ కోర్సులు చేయొచ్చు.
- మెకానికల్ ఇంజినీరింగ్ 3 ఏళ్ల డిప్లొమా కోర్సు. వీరికి ప్రైవేటు, ప్రభుత్వ వర్క్‌షాప్స్ అండ్ గ్యారేజస్, ట్రాన్స్‌పోర్ట్, ప్రొడక్షన్ యూనిట్స్, సేల్స్ విభాగాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. మెకానికల్ ఇంజినీరింగ్ వారికి యాన్సిలరీ యూనిట్స్, సేల్స్ విభాగాల్లో ఉపాధి అవకాశాలు అధికం. వీరు బీటెక్‌లో మెకానికల్ ఇంజినీరింగ్, ఇండస్ట్రియల్ ప్రొడక్షన్, ఆటోమొబైల్, ఏరోనాటికల్, ఏరోస్పేస్, మెకానికల్ మెరైన్, మెకట్రానిక్స్ ఇంజినీరింగ్ కోర్సులను అభ్యసించవచ్చు.
- ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్(ఈఈఈ) 3 ఏళ్ల డిప్లొమా కోర్సు. పూర్తి చేసిన వారికి ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, డీసీఎల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్, మెయింటెనెన్స్, స్టాఫ్ ఇన్ డిపార్ట్‌మెంట్స్ అండ్ ఇండస్ట్రీస్‌లో ఉద్యోగావకాశాలున్నాయి. ఎలక్ట్రిక్ టెక్నీషియన్స్, వైండర్స్ వైరింగ్‌లో స్వయం ఉపాధి ఉంటుంది. వీరు బీటెక్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చేయొచ్చు.
- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్(ఈసీఈ) 3 ఏళ్ల డిప్లొమా కోర్సు. ఏఐఆర్, డీడీ, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీస్‌లలో ఉద్యోగావకాశాలున్నాయి. రేడియో, టీవీ రిపేర్స్, సేల్స్ అండ్ సర్వీసెస్‌లో ఉపాధికి వెసులుబాటు ఉంది. వీరు బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలిమేటిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్ అభ్యసించవచ్చు.
- కంప్యూటర్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్(సీఎంఈ) 3 ఏళ్ల డిప్లొమా కోర్సు. కంప్యూటర్ మెయింటెనెన్స్ అండ్ ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీస్, పారామేస్యుటికల్ ఇండస్ట్రీస్‌లో ఉద్యోగావకాశాలున్నాయి. సేల్స్ అండ్ సర్వీసింగ్ ఆఫ్ ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో స్వయం ఉపాధి ఉంది. వీరు ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్/టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరొచ్చు.
- బయో మెడికల్ ఇంజినీరింగ్ మూడున్నరేళ్ల డిప్లొమా కోర్సు. వీరికి మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్, హాస్పిటల్స్‌లో ఉద్యోగావకాశాలున్నాయి. వీరు బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలిమేటిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్సులు చేయొచ్చు.
- కెమికల్ ఇంజినీరింగ్ (షుగర్ టెక్నాలజీ) 3ఏళ్ల డిప్లొమా కోర్సు. వీరికి పేపర్, షుగర్, పెట్రోకెమికల్, ప్లాస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్‌లో ఉద్యోగావకాశాలున్నాయి. వీరు బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్, పెట్రోకెమికల్ ఇంజినీరింగ్, పెట్రోలియం ఇంజినీరింగ్/టెక్నాలజీ కోర్సులు అభ్యసించవచ్చు.
- కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ (సీసీపీ) మూడేళ్ల కోర్సు. వీరికి ప్రభుత్వ, ప్రైవేటు శాఖలో స్టెనోస్, టైపిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్స్ ఉద్యోగావకాశాలున్నాయి. వీరు బీకామ్(ఐఐపైఆర్), సీఏ, ఐసీడబ్ల్యూఏఐ, సీఎస్, ఎంబీఏ కోర్సుల్లో చేరొచ్చు.
- డిప్లొమో ఇన్ కెమికల్ ఇంజినీరింగ్ షుగర్ టెక్నాలజీ స్పెషలైజేషన్ మూడేళ్ల కోర్సు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి షుగర్ కేన్ ఇండస్ట్రీస్, కెమికల్ ఇండస్ట్రీస్‌ల్లో ఉద్యోగ అవకాశాలున్నాయి. అలాగే బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్ చదవవచ్చు.
- డిప్లొమో ఇన్ మైనింగ్ ఇంజినీరింగ్ మూడేళ్ల కోర్సు. పూర్తి చేసిన వారికి మైనింగ్, సిమెంటు పరిశ్రమలు, థర్మల్ పవర్ స్టేషన్లో, ఎన్విరాన్‌మెంట్ ఆర్గనైజేషన్లలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయి. అలాగే బీటెక్ ఇన్ మైనింగ్ ఇంజినీరింగ్ కోర్సును అభ్యసించవచ్చు.
- డిప్లొమో ఇన్ కంప్యూటర్ అండ్ కమర్షియల్ ప్రాక్టీస్ మూడేళ్ల కోర్సు. ఈ కోర్సు అభ్యసించిన వారికి బ్యాంకులు, పబ్లిక్, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. వివిధ కంపెనీల్లో పర్సనల్ సెక్రటరీ, స్టెనోగ్రాఫర్స్ ఉద్యోగాలు లభిస్తాయి. అలాగే బీకామ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు.
- డిప్లొమా ఇన్ సెరామిక్ టెక్నాలజీ మూడేళ్ల కోర్సు. పూర్తి చేసిన వారికి టైల్స్, గ్లాస్ రిఫ్రాక్టరీస్, శానిటరీ వేర్ సిమెంటు తయారుచేసే పరిశ్రమల్లోనూ, అలాగే మార్కెటింగ్, రీసెర్చ్ ఆర్గనైజేషన్లలో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. అలాగే రాజస్థాన్‌లోని బికనీర్ యూనివర్సిటీలో బీటెక్ ఇన్ సెరామిక్ టెక్నాలజీ కోర్సుతో పాటు బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సును అభ్యసించవచ్చు.
- డిప్లొమా ఇన్ బయోమెడికల్ ఇంజినీరింగ్ మూడున్నరేళ్ల కోర్సు. చదివిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. అలాగే బీటెక్ ఇన్ బయో మెడికల్ ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశం పొందవచ్చు.

చక్కటి ఉపాధి



డిప్లొమా కోర్సులతో చక్కటి ఉపాధి లభిస్తుంది. వివిధ సంస్థలు డిప్లొమా పూర్తి చేసిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నాయి. జీవితంలో త్వరగా స్థిరపడడానికి పాలిటెక్నిక్ సరైన మార్గం. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇదో మంచి అవకాశం. డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగం, ఉపాధి పొందవచ్చు. పై చదువులకు సైతం ఉపయోగపడుతుంది. ఈ క్రమంలోనే విద్యార్థులకు బుధవారం నుంచి ఉచితంగా శిక్షణ సైతం అందిస్తున్నాం.

– వై.ద్వారకనాథరెడ్డి, ప్రిన్సిపల్, పాలిసెట్ జిల్లా కన్వీనర్, తిరుపతి

ముక్కంటీ.. కనవేంటి!

- శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రసాదాల కొరత




శ్రీకాళహస్తి ఆలయంలో ప్రసాదాల కోసం వేచి ఉన్న భక్తులు

రేణిగుంట : దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులను ప్రసాదాల కొరత ఆవేదనకు గురిచేస్తోంది. దేశవిదేశాల నుంచి ముక్కంటి దర్శనానికి తరలివస్తే పవిత్ర ప్రసాదం కూడా ఆలయ అధికారులు అందించలేకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రధానంగా శని, ఆది, సోమవారాల్లో వేలాది మంది భక్తులు ముక్కంటీశుని దర్శించుకుంటారు. ఆదిదంపతును సేవించుకున్న తర్వాత ప్రసాదాలను అత్యంత ప్రీతిపాత్రంగా స్వీకరిస్తుంటారు. ముఖ్యంగా పులిహోరా, లడ్డూ, వడ, జిలేబీని భక్తిశ్రద్ధలతో కొనుగోలు చేస్తుంటారు. అయితే ప్రసాదాలు లేవని కౌంటర్ సిబ్బంది తిప్పిపంపుతుండడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పులిహోరా దొరకక భక్తులు తీవ్రంగా నిరాశ చెందుతున్నారు. ఈ క్రమంలోనే భక్తుల తాకిడి ఎక్కువగా లేని మంగళవారం కూడా పులిహోరా నిండుకోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రసాదాల కౌంటర్ వద్ద నిరాశగా కూర్చున భక్తుల ఆవేదనను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సాక్షి ప్రయత్నించగా వారు స్పందించలేదు. ప్రసాదాలు తయారు చేసే పోటు వద్దకు వెళ్లగా ఆలయ డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి అడ్డుపడ్డారు. ఇక్కడకు రాకూడదని, ఫొటోలు తీయకూడదని ఎప్పుడూ లేని నిబంధనలు వల్లించడం గమనార్హం.

ఎస్‌ఓ మండపం సమీపంలో వ్యక్తి మృతి

తిరుమల : శ్రీవారి ఆలయానికి సమీపంలో ఉన్న సహస్రదీపాలంకార సేవా మండపం సమీపంలో ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. తిరుమల వన్‌టౌన్ పీఎస్ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం, తిరువళ్లూరుకు చెందిన ఎస్.మోహన సుందర్(35) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఇతను శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నాడు. స్థానిక ఎస్ఓఏ మండపం వద్ద సేదతీరుతూ అపస్మారక స్థితికి చేరుకుని మృతిచెందాడు. భక్తులు గుర్తించి టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని అశ్విని ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులను గుర్తించి వారికి సమాచారం అందించారు.

ఎర్రచందనం పట్టివేత



సీజ్ చేసిన దుంగలు, వాహనంతో ఫారెస్ట్ అధికారులు

రాపూరు : మండలంలోని మద్దెలమడుగు చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. వెంకటగిరి వైపునకు అధిక వేగంతో వెళుతున్న తమిళనాడుకు చెందిన మినీ ట్రక్‌ను ఫారెస్ట్ సిబ్బంది అడ్డుకున్నారు. ఎండు గడ్డి లోడ్‌తో ఉన్న ట్రక్‌ను వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. వాహనంలో తనిఖీ చేయగా గడ్డి మోపుల కింద రూ.15లక్షల విలువైన 89 ఎర్రచందనం దుంగలు ఉన్నాయి. ఎర్రచందనంతోపాటు వాహనాన్ని కూడా సీజ్ చేసినట్లు రాపూరు అటవీశాఖ రేంజర్ రవీంద్రబాబు వెల్లడించారు. తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ వరప్రసాద్, చక్రపాణి, చంద్రశేఖర్, బీట్ అధికారులు షఫీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో ప్రమాదం

– ఐదుగురికి గాయాలు

తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో మంగళవారం టీటీడీకి చెందిన వ్యాన్ రక్షణగోడను ఢీకొంది. దీంతో ఐదుగురు గాయపడ్డారు. వివరాలు.. కొండ మీద అనధికారికంగా నివాసం ఉంటున్న 12 మందిని తిరుపతికి తరలిస్తుండగా ఆఖరు మలుపు వద్ద అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను రుయా ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబూ..రోగులకు సేవ చెయ్!

వెంకటగిరి రూరల్ : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిని రోగులకు సేవ చేయాలంటూ వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి మంగళవారం వినూత్నంగా తీర్పునిచ్చారు. వివరాలు.. బంగారుపేటకు చెందిన పవన్ అనే వ్యక్తి ఆదివారం మద్యం సేవించి మోటారుసైకిల్ నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్ఐ సుబ్బారావు ఈ మేరకు వైద్య పరీక్షలు చేయించి కోర్టులో హాజరుపరిచారు. విచారించిన న్యాయమూర్తి ఈ మేరకు పవన్‌కు రూ.500 జరిమానాతోపాటు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు వెంకటగిరి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు సేవలు చేయాలని తీర్పు వెలువరించారు.

పేరు నాది.. పని నీది!

సూళ్లూరుపేట : పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నాలుగేళ్లుగా ఒకరి ఉద్యోగం మరొకరు చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారం స్థానిక వైద్యాధికారులకు ఇదివరకే తెలిసినా కొన్ని ప్రలోభాలకు లొంగిపోయినట్లు తెలిసింది. వివరాలు.. సూళ్లూరుకు చెందిన జ్యోతి అనే మహిళ ఆశ వర్కర్‌గా పనిచేస్తున్నారు. నాలుగేళ్ల క్రితమే ఆమె తన తమ్ముడి భార్య సెల్వికి అనధికారికంగా తన ఉద్యోగం అప్పగించింది. ప్రతి నెలా జీతం మాత్రం జ్యోతి తీసుకునేది. దీనిపై కొందరు జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేయడంతో నాలుగు రోజుల క్రితం నోడల్ ఆఫీసర్ విచారణ చేపట్టి నివేదిక పంపినట్టుగా తెలుస్తోంది. ఈ మేరకు జిల్లా వైద్యాధికారిని సాక్షి వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి కూడా వచ్చిందన్నారు. వారిపై చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

పింఛన్ సొమ్ముతో వెటర్నరీ అసిస్టెంట్ పరార్

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేట గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ సాహిదుల్లా సామాజిక పింఛన్ సొమ్ముతో పరారైనట్లు సమాచారం. మండలంలో మంగళవారం పింఛన్ సొమ్ము పంపిణీ చేపట్టారు. అయితే కాళమనాయుడుపేట వెటర్నరీ అసిస్టెంట్ సాహిదుల్ల కొత్తమారికుప్పంలో పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంది. మంగళవారం ఉదయం 11 గంటలు దాటినా అక్కడి లబ్ధిదారులకు పింఛన్ అందలేదు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ చంద్రశేఖర్ వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వెటర్నరీ అసిస్టెంట్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పశువుల నీటి తొట్టెకు భూమిపూజ



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్, డ్వామా పీడీ తదితరులు

నారాయణవనం: వేసవిలో మూగజీవుల దాహార్తి తీర్చడానికి నీళ్ల తొట్టెలు యుద్ధప్రాతిపదికన నిర్మించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన నారాయణవనంలో నీళ్ల తొట్టె నిర్మాణానికి భూమి పూజ చేశారు. పార, పలుగు చేతపట్టి తవ్వారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ రూ.31 వేల అంచనా వ్యయంతో 15 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పుతో ఉపాధి హామీ పథకం నిధులతో నీళ్లతొట్టెలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో గుణశేఖర్, తహసీల్దార్ జయరాములు పాల్గొన్నారు.

ఆధునికంగా తిరుపతి రైల్వేస్టేషన్



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

తిరుపతి అర్బన్: తిరుపతి రైల్వే స్టేషన్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నట్లు స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ వెల్లడించారు. మంగళవారం రైల్వే అధికారులతో కలసి తుది దశలో ఉన్న స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ.300 కోట్లతో రెండేళ్లుగా తిరుపతి రైల్వే స్టేషన్‌లో చేపట్టిన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నట్లు తెలిపారు. 20 లిఫ్టులు, 22 ఎస్కలేటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టాయిలెట్స్, వాహనాల పార్కింగ్, విశ్రాంతి గదులు తదితర సౌకర్యాలు ఉంటాయని స్పష్టం చేశారు. నార్త్ ఇండియాలోని వీరేంద్ర కన్‌స్ట్రక్షన్ కంపెనీ నేతృత్వంలో నాణ్యతతో కూడిన పనులు పూర్తి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ చిన్నరెడ్డెప్ప పాల్గొన్నారు.

చదువుకు ‘రాక్‌వర్త్’ చేయూత



సహాయ పత్రాలు అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

శ్రీసిటీ (సత్యవేడు): శ్రీసిటీలోని రాక్‌వర్త్ ఫర్నీచర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యం తమ కంపెనీ కార్మికుల పిల్లల చదువుకు ఆర్థిక సాయం అందిస్తోంది. మంగళవారం కంపెనీ వార్షికోత్సవం సందర్భంగా సీఈఓ శైలేష్‌కుమార్ తన తల్లి జ్ఞాపకార్థం మీనాదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా 22 మంది విద్యార్థులకు ఫీజు నిమిత్తం రూ.15లక్షలు అందించారు. ఈ మొత్తాన్ని నేరుగా ఆయా విద్యాసంస్థలకు చేరేలా చర్యలు చేపట్టారు. శైలేష్ సేవలను శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ప్రశంసించారు. రాక్‌వర్త్ కంపెనీ ఇప్పటి వరకు 40 మంది పిల్లలకు రూ.31లక్షల ఆర్థిక సాయం అందించిందని వెల్లడించారు.

డ్రైవింగ్ శిక్షణ సంస్థకు అనుమతి



మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్

తిరుపతి మంగళం: ప్రతి జిల్లాలో డ్రైవింగ్ శిక్షణ సంస్థ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసిందని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. మంగళవారం మంగళంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో లైట్ మోటార్ వాహనాలు, హెవీ మోటర్ వాహనాల డ్రైవింగ్ స్కూల్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మురళీమోహన్ మాట్లాడుతూ డ్రైవింగ్ శిక్షణ సంస్థను పాలిటెక్నిక్, ఐటీఐ, ఎన్‌జీఓస్, ట్రస్ట్, కో–ఆపరేటివ్ సొసైటీ, వాహన తయారీ దారులు, ప్రధాన డ్రైవింగ్ స్కూల్స్ యాజమాన్యాలు నెలకొల్పవచ్చని వెల్లడించారు. అందుకు విధిగా రెండు ఎకరాల స్థలం సొంతంగా కానీ లీజుకు కానీ తీసుకోవాల్సి ఉంటుందని వివ రించారు. జిల్లాలో 20 లక్షల నుంచి 30 లక్షల జనాభా ఉన్నందున రెండు డ్రైవింగ్ శిక్షణ సంస్థలు ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఇందుకోసం ప్రభుత్వం 85శాతం ఆర్థిక సహాయం చేస్తుందని తెలిపారు. ఆసక్తిగల వారు 2026 మార్చి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు రవాణాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి విజయ ప్రశాంతి, సీనియర్ సహాయకుడు యువకిషోర్ పాల్గొన్నారు.

అమ్మ దొంగా!



శ్రీకాళహస్తి పట్టణంలోని తెట్టు వద్ద పాల కేంద్రం సమీపంలో విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఓ కూటమి నేత కబ్జా చేశాడు. దీనికి దొంగ రికార్డులు సృష్టించాలని ఎంతగానో ప్రయత్నించి విఫలమయ్యాడు. ఆ తర్వాత ఏదైతే అది అవుతుందనుకుని కబ్జా స్థలంలో కట్టడాలు ప్రారంభించాడు. దీనిపై అధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో చేసేది లేక రెండు రోజుల క్రితం ఆక్రమిత స్థలం ముందు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పేరుతో చలివేంద్రం ఏర్పాటు చేశాడు. వెనుక మాత్రం యథావిధిగా కట్టడాలు ప్రారంభించాడు. అటువైపు వెళ్లేవారు ఔరా..? అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. – శ్రీకాళహస్తి